ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :154 సోమవారం మార్చి 30 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## రేపల్లెలో ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- ఎన్టీఆర్ సిద్ధాంతాలతో ముందుకు సాగుతున్న పార్టీ**

**- సీనియర్ కార్యకర్తలకు ఘన సత్కారం**

**- ప్రజా సంక్షేమంలో టీడీపీ పాత్రపై నేతల ప్రశంసలు**







రేపల్లె, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రేపల్లె ఎంసీఏ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, మాజీ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణరావు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు సిద్ధాంతాలను గుర్తు చేసుకుంటూ నేతలు నివాళు లర్పించారు. తెలుగు జాతి ఆత్మగౌరవ నినాదంతో ప్రారంభమైన ఈ పార్టీ నేడు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మరింత బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. అలాగే మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో యువతను ఆకర్షిస్తూ ముందుకు సాగుతోందని అన్నారు.పార్టీ కోసం కష్టపడిన 44 మంది సీనియర్ కార్యకర్తలను ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. వారికి ఎన్టీఆర్ చిత్రంతో ముద్రించిన రూ.100 స్మారక నాణేలను బహుమతిగా అందజేశారు. కార్యకర్తల అంకితభావాన్ని కొనియాడుతూ, వారి సేవలను నేతలు అభినందిం చారు.తెలుగుదేశం పార్టీ 44 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో సంక్షోభాలను ఎదుర్కొని విజయవంతంగా ముందుకు సాగిందని నాయకులు పేర్కొన్నారు. 2 రూపాయలకే కిలో బియ్యం, జనతా వస్త్రాలు, మహిళలకు ఆస్తి హక్కులు వంటి పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన పార్టీగా టీడీపీ నిలిచిందని తెలిపారు.మండల వ్యవస్థను ప్రవేశపెట్టి స్థానిక పాలనను ప్రజలకు దగ్గర చేసిన ఘనత కూడా టీడీపీదేనని నేతలు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ పార్టీ ముందుకు సాగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. పసుపు జెండాను సగర్వంగా మోస్తూ పార్టీ కోసం శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ప్రజల శ్రేయస్సు కోసం టీడీపీ కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్‌కు భారీ చేరికలు



**- కాంగ్రెస్‌ను వీడి గులాబీ దళంలోకి నాయకులు**

**- కేటీఆర్ చేతుల మీదుగా ఆహ్వానం**

**- ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా చేరికలు**

ఆసిఫాబాద్, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): ఆసిఫాబాద్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీని వీడి పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు భారత రాష్ట్ర సమితిలో చేరారు. సర్పంచులు, ఉప సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ చేరికలు ఎమ్మెల్యే కోవా లక్ష్మీ ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొత్తగా చేరిన నాయకులకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా రాళ్లపాడు, లింగాపూర్, చిన్న దాంపూర్, పిట్టగూడ, ఎల్లాపూర్ వంటి గ్రామాలకు చెందిన పలువురు సర్పంచులు, ఉప సర్పంచులు తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ముఖ్యంగా అనుముల రాకేష్, రెబ్బెన సుధాకర్, జాదవ్ రాజశేఖర్, పవార్ సులోచన, ఆడే సునిత, పవార్ బాబులాల్, నైతం ఛత్రు, లఖ్యా నాయక్ వంటి నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు బీఆర్ఎస్‌లో చేరుతున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా బీఆర్ఎస్ పనిచేస్తుందని నమ్మకం వ్యక్తం చేశారు.కేటీఆర్ మాట్లాడుతూ, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలంగా నిలబెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కూడా పాల్గొన్నారు. భారీ సంఖ్యలో జరిగిన ఈ చేరికలు ఆసిఫాబాద్ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## అక్రమ మైనింగ్ ఆరోపణలపై తెలంగాణలో రాజకీయ ఉద్రిక్తత

**- మంత్రి పొంగులేటిపై తీవ్ర విమర్శలు బీఆర్ఎస్ డిమాండ్లు**

**- హౌస్ కమిటీ లేదా హైకోర్టు న్యాయమూర్తితో విచారణ కోరిన హరీష్ రావు**

**- కాంగ్రెస్ ప్రభుత్వంపై 20 కుంభకోణాల ఆరోపణలు**

హైదరాబాద్, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసే వ్యాఖ్యలు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమ మైనింగ్‌లో పాల్గొన్నారని ఆరోపిస్తూ, ఈ విషయం ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు స్పష్టమైందన్నారు. టీవీల్లో వెలువడిన సమాచారంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో కూడా ఈ అంశం బహిర్గతమైందని ఆయన పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిపోయిందని, డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని హరీష్ రావు విమర్శించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థ అవినీతిపై సీఎం చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, నిజాలను దాచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అసెంబ్లీలో అక్రమ మైనింగ్‌పై మాట్లాడేందుకు తమకు అవకాశం ఇవ్వలేదని, అదే సమయంలో సీబీసీఐడీ విచారణ అంటూ ప్రభుత్వం ముందుకు రావడం అనుమానాస్పదమని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ అంశంపై హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసినప్పటికీ, ప్రభుత్వం స్పందించలేదని హరీష్ రావు అన్నారు. నిష్పక్షపాత విచారణ కోసం హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆధ్వర్యంలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో విచారణపై ప్రజలకు నమ్మకం ఉండదని స్పష్టం చేశారు.దళితుల అంశాన్ని కూడా హరీష్ రావు ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులపై కపట ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో దళిత సంక్షేమానికి భారీ నిధులు కేటాయించామని, ప్రస్తుతం ఆ స్థాయిలో కేటాయింపులు లేవని తెలిపారు. దళితబంధు వంటి పథకాల ద్వారా బీఆర్ఎస్ నిజంగా దళితుల అభివృద్ధికి కృషి చేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న నేతలపై ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. కౌశిక్ రెడ్డిపై జరిగిన చర్యలను ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. అసెంబ్లీలో ఎథిక్స్ కమిటీ వ్యవహారాన్ని కూడా ప్రశ్నిస్తూ, ఇది రాజకీయ కుట్రలో భాగమని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అనేక కుంభకోణాలు జరిగాయని హరీష్ రావు ఆరోపించారు. మొత్తం 20 స్కాములపై ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్ వల్ల రాష్ట్ర ఖజానాకు వందల కోట్లు నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని, ప్రజల ముందుకు నిజాలను తీసుకువస్తామని స్పష్టం చేశారు.




## తల్లిదండ్రుల రక్షణకు కొత్త చట్టం తీసుకొస్తాం సీఎం



**- "పేరెంటల్ సపోర్ట్ బిల్లు-2026"పై సభలో చర్చ**

**- వృద్ధుల భద్రతకు కీలక ముందడుగు**

**- సమాజానికి బాధ్యతాయుత సందేశం**

హైదరాబాద్, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): సమాజంలో ఏ కుటుంబంలోనూ తల్లిదండ్రులు అనాథలుగా మిగిలిపోకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకొస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. శాసనసభలో మంత్రి ఆదిలూరి లక్ష్మణ్ ప్రవేశపెట్టిన "తెలంగాణ ఎంప్లాయిస్ అకౌంటబిలిటీ, మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్ బిల్లు-2026"పై సీఎం మాట్లాడారు.వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు భద్రత కల్పించాల్సిన బాధ్యతను గుర్తుచేస్తూ ఈ చట్టాన్ని తీసుకొచ్చినట్లు సీఎం తెలిపారు. తల్లిదండ్రుల పట్ల బాధ్యత లేకుండా వ్యవహరించే వారికి భయం కలిగించడమే ఈ బిల్లుకు ఉద్దేశమని పేర్కొన్నారు. వృద్ధుల సంరక్షణలో ఇది కీలకమైన అడుగు అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలో బంధాలు, అనుబంధాలు తగ్గిపోతున్నాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. భౌతిక సుఖాలు, ఆర్థిక ప్రయోజనాల కోసం పేగు బంధాలను కూడా విస్మరించే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకునే పరిస్థితులు సమాజానికి మేలు చేయవని వ్యాఖ్యానించారు .పిల్లలు, మహిళల రక్షణ కోసం ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. బాలల హక్కులు, మహిళల భద్రత, వృద్ధుల సంక్షేమానికి సంబంధించి దేశంలో పలు చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ, తల్లిదండ్రుల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం కొనసాగుతోందని పేర్కొన్నారు. శ్రవణ కుమారుడి కథను ఉదాహరణగా చెప్పిన సీఎం, తల్లిదండ్రుల పట్ల భక్తి, గౌరవం పెరగాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ పథ్ సింఘానియా జీవితాన్ని ప్రస్తావిస్తూ, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం వల్ల కలిగే పరిణామాలను సభకు వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులను కూడా ఈ చట్టం పరిధిలోకి తీసుకొస్తున్నామని సీఎం తెలిపారు. ఈ బిల్లుతో వృద్ధ తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. అన్ని పక్షాలు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు.



## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పోరాటానికి కవిత మద్దతు

**- గత ప్రభుత్వ వైఫల్యాలపై బహిరంగ క్షమాపణ**

**- సమస్య పరిష్కారం కోసం కఠిన హెచ్చరిక**






హైదరాబాద్, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నిర్వహించిన ధర్నాకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులకు జాగృతి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో భాగంగా ఉండి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయినందుకు బహిరంగంగా క్షమాపణ కోరారు. ఆ సమయంలో జరిగిన తప్పుల్లో తనకూ భాగం ఉందని అంగీకరిస్తూ, ఉద్యోగులందరిని క్షమించాలని కోరారు. ఇది రాజకీయంగా అరుదుగా కనిపించే స్వీయ విమర్శగా నిలిచింది. రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ప్రభుత్వంపై అదనపు భారం లేకుండా సమస్యలను పరిష్కరించే మార్గాలు ఉన్నప్పటికీ, ఏజెన్సీలకు మద్దతు ఇస్తూ ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.వెంటనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మధ్యవర్తి ఏజెన్సీలను తొలగించి, ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించే విధానం తీసుకురావాలని సూచించారు. ఈ విధానం అమలు చేస్తే ఉద్యోగులకు భద్రత, హక్కులు కల్పించవచ్చని తెలిపారు.మహిళా ఉద్యోగుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల ద్వారా ఎంపికైనప్పటికీ వారికి సరైన హక్కులు, సౌకర్యాలు అందడం లేదని పేర్కొన్నారు. కనీసం ప్రసూతి సెలవులు కూడా ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఉదాహరణ అని అన్నారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు. హైదరాబాద్ వీధుల్లో భారీ స్థాయిలో ఉద్యోగులు మార్చ్ చేస్తే ప్రభుత్వం వెంటనే స్పందించాల్సి వస్తుందని తెలిపారు. సమస్యకు పరిష్కారం దొరికే వరకు పోరాటం కొనసాగుతుందని, జాగృతి తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# విద్యార్థులకు ఉచిత సైకిళ్లు పంపిణీ చేసిన మంత్రి

**- కామేపల్లి పాఠశాలలో 37 మందికి లబ్ధి**
**- గ్రామీణ విద్యార్థుల సౌకర్యాల పెంపుపై దృష్టి**
**- విద్యాభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాది**



బాపట్ల, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): సంతమాగులూరు మండలం కామేపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొని 37 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు.గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి తెలిపారు. సైకిళ్ల పంపిణీతో విద్యార్థులు సులభంగా పాఠశాలకు చేరుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభ్యాసం నిరంతరంగా కొనసాగేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాది అన్న నమ్మకంతో పనిచేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా విద్యా రంగంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. సైకిళ్లు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సదుపాయం వల్ల తమ చదువులకు మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమాన్ని అభినందించారు.భవిష్యత్తులో మరిన్ని విద్యార్థులకు ఇలాంటి సదుపాయాలు అందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గ్రామీణ విద్యాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

# ఉండవల్లిలో టీడీపీ సీనియర్లకు ఆత్మీయ విందు

**- పాల్గొన్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్**
**- సీనియర్ కార్యకర్తలకు గౌరవం ప్రోత్సాహానికి హామీ**
**- పంచాయతీ ఎన్నికలకు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు**






ఉండవల్లి, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): ఉండవల్లిలో పార్టీ సీనియర్ కార్యకర్తలకు ఆత్మీయ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో ఆత్మీయంగా మాట్లాడిన నాయకులు, పార్టీ అభివృద్ధికి వారు చేసిన సేవలను గుర్తుచేశారు. కార్యకర్తల కృషివల్లే పార్టీ బలంగా నిలుస్తోందని పేర్కొన్నారు. వారి అంకితభావం పార్టీ విజయానికి ప్రధాన కారణమని అభినందించారు.మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, పార్టీ అధినేత చంద్రబాబు కృషివల్లే టీడీపీ ఈ స్థాయికి చేరిందని స్పష్టం చేశారు. పార్టీ ఎదుగుదలలో సీనియర్ కార్యకర్తల పాత్ర అమూల్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా వారి మార్గదర్శకత్వం అవసరమని తెలిపారు. సీనియర్ నాయకులను గౌరవించడం పార్టీ సంప్రదాయమని లోకేశ్ అన్నారు. పనిచేసే కార్యకర్తలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు.రాబోయే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసి పనిచేయాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

# ఐఓసి ప్రార్థన మందిరంలో ఘనంగా మట్టల ఆదివారం



మనప్రజాప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 29:మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని ఐఓసి ప్రార్థన మందిరంలో మట్టల ఆదివారం వేడుకలు భయభక్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విశ్వాసులు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు.పాస్టర్ ప్రభుదాస్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఓసి చర్చ్ పాస్టర్ ఎం. ప్రభుదాస్ విశ్వాసులను ఉద్దేశించి దేవుని వాక్యాన్ని బోధించారు. మత్తయి సువార్త 21:9 ఆధారంగా "దావీదు కుమారునికి జయము (హోసన్న), ప్రభువు పేరట వచ్చువాడు స్తుతించబడును గాక, సర్వోన్నతమైన స్థలంలో జయం" అనే సందేశాన్ని వివరించారు.ఈ సందర్భంగా విశ్వాసులు భయభక్తులతో ప్రార్థనలు చేస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సుధాకర్, లక్ష్మణ్, భక్త పాల్, డా. ప్రభుదాస్, నాగమోహన్, తిమ్మాయిపల్లి లచ్చన్న, నోవహు, ప్రశాంత్, చిన్నశివునూర్ బిక్షపతి, లైబ్రేరీ గణేష్, యువకులు జాన్. ప్రభు, మధు, ప్రేమ్. జోయల్ రాజ్ ,తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరిన అంజన్న స్వాములు



మనప్రజాప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 29:మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలోని ఐఓసి ప్రార్థన మందిరంలో మట్టల ఆదివారం వేడుకలు భయభక్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విశ్వాసులు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు.పాస్టర్ ప్రభుదాస్, సంఘ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఓసి చర్చ్ పాస్టర్ ఎం. ప్రభుదాస్ విశ్వాసులను ఉద్దేశించి దేవుని వాక్యాన్ని బోధించారు. మత్తయి సువార్త 21:9 ఆధారంగా "దావీదు కుమారునికి జయము (హోసన్న), ప్రభువు పేరట వచ్చువాడు స్తుతించబడును గాక, సర్వోన్నతమైన స్థలంలో జయం" అనే సందేశాన్ని వివరించారు.ఈ సందర్భంగా విశ్వాసులు భయభక్తులతో ప్రార్థనలు చేస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు సుధాకర్, లక్ష్మణ్, భక్త పాల్, డా. ప్రభుదాస్, నాగమోహన్, తిమ్మాయిపల్లి లచ్చన్న, నోవహు, ప్రశాంత్, చిన్నశివునూర్ బిక్షపతి, లైబ్రేరీ గణేష్, యువకులు జాన్. ప్రభు, మధు, ప్రేమ్. జోయల్ రాజ్ ,తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసిన నిందితుడు అరెస్ట్

**- ఆత్మకూర్, నంద్యాల పరిధిలో వరుస చోరీలు వెలుగులోకి**
**- 42 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం**
**- ఎస్పీ సునీల్ షోరాణ్ ఆధ్వర్యంలో విజయవంతమైన చర్య**



నంద్యాల, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): జల్సాలకు అలవాటు పడి వరుస దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ మరియు నంద్యాల1 టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీల




కేసుల్లో ఈ నిందితుడు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో అతను పలు దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని నుంచి సుమారు 42 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఆభరణాలను వివిధ ప్రాంతాల్లో జరిగిన చోరీల నుంచి సేకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు విలాసవంతమైన జీవనశైలికి అలవాటు పడి డబ్బు కోసం ఈ దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఆపరేషన్ నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేయడం సాధ్యమైంది.పోలీసుల వేగవంతమైన చర్యల వల్ల దొంగిలించిన ఆస్తిని తిరిగి స్వాధీనం చేసుకోవడం సాధ్యమైందని తెలిపారు. బాధితులకు ఆభరణాలను తిరిగి అందించే ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో చోరీలపై కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు. నేరాలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పాకాల పరిధిలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసుల ప్రత్యేక దృష్టి

**- ఎస్పీ ఆదేశాలతో కట్టుదిట్టమైన చర్యలు**
**- నేర కార్యకలాపాలపై నిరంతర నిఘా**
**- చట్టవిరుద్ధ వ్యవహారాలకు తావులేదని హెచ్చరిక**



తిరుపతి, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): తిరుపతి జిల్లా పాకాల అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం పెరగకుండా నిరోధించేందుకు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ చర్యలు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే చంద్రగిరి ఎస్డీపీఓ బేతపూడి ప్రసాద్ సూచనలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసులు అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు పెంచి, అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. గంజాయి నిల్వలు, రవాణా మార్గాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. నేరస్తులను గుర్తించి అరెస్టు చేసే చర్యలు వేగవంతం చేశారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టగలమని తెలిపారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువతను దారి తప్పించే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వబోమని పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంలో భాగంగా ఇటువంటి చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణకు మరిన్ని చర్యలు చేపట్టి సమాజాన్ని రక్షించడమే లక్ష్యమని వెల్లడించారు.

# ఘనంగా తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- మంగళగిరిలో జెండా ఆవిష్కరించిన చంద్రబాబు**
**- రాష్ట్రవ్యాప్తంగా పసుపు జెండాల సంబరం**



మంగళగిరి, మార్చి 29 (మనప్రజాప్రతినిధి): తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు పండుగలా జరుపుకుంటున్నాయి. గ్రామాల నుంచి పట్టణాల వరకు ఎక్కడ చూసినా పసుపు జెండాలు ఎగురుతూ, కార్యకర్తల్లో ఉత్సాహం ఉప్పొంగుతోంది. 1982లో స్థాపించబడిన ఈ పార్టీ నాలుగు దశాబ్దాల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వేడుకల్లో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. భారీ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యకర్తల నినాదాలతో కార్యాలయ ప్రాంగణం మారుమోగింది. అనంతరం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ఎన్టీ రామారావు విగ్రహానికి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పట్ల ఎన్టీఆర్ చేసిన సేవలను స్మరించారు.కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలను చంద్రబాబు వ్యక్తిగతంగా పలకరించారు. వారితో మమేకమై, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయత కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో కూడా చంద్రబాబు పాల్గొన్నారు. వేదికపై ఉన్న ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం, పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న సీనియర్ కార్యకర్తలను వేదికపైకి ఆహ్వానించి వారితో కలిసి కూర్చోవడం విశేషంగా నిలిచింది.రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ టీడీపీ శ్రేణులు వేడుకలు నిర్వహించాయి. పార్టీ జెండాలు ఎగురవేసి, మిఠాయిలు పంచుతూ ఆనందాన్ని పంచుకున్నారు. 44 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న టీడీపీ, భవిష్యత్తులో మరింత బలంగా ఎదగాలని కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజల క్షేమమే లక్ష్యంగా... కుక్కలు, కోతులను, పట్టి అడవిలో వదిలిన




## -సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్

మనప్రజాప్రతినిధి// చేగుంట మార్చి 29:చేగుంట మండల కేంద్రం లో గత కొంతకాలంగా ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న, వీధి కుక్కలు, కోతుల బెడదకు, స్వస్తి పలికేందుకు పాలకవర్గం నడుం బిగించింది. పట్టణ సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్ ఆధ్వర్యంలో గ్రామంలోని వీధి కుక్కలను, కోతులను పట్టించే కార్యక్రమాన్ని ఆదివారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని



నిర్వహించారు, పట్టణం లో వీధి కుక్కల సంఖ్య,విపరీతంగా పెరగడంతో చిన్న పిల్లలు, మహిళలు, రోడ్డు దాటాలన్నా, బయటకు రావాలన్నా భయాందోళనకు గురవుతున్నారు.పాఠశాలలకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థులు కుక్కల గుంపులను చూసి బెంబేలెత్తిపోతున్నారు. వీటికి తోడు కోతుల బెడద కూడా తోడవడంతో మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్, పాలకవర్గం సభ్యుల దృష్టికి వచ్చింది. ప్రజల క్షేమం, భద్రత దృష్ట్యా ,వెంటనే స్పందించిన సర్పంచ్ స్రవంతి సతీష్, ఉపసర్పంచ్ రఫీ , వార్డు సభ్యులు ప్రత్యేక బృందాలను పిలిపించి కుక్కలను, కోతులను పట్టించే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు,. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పట్టణ ప్రజల ప్రాణరక్షణే, తమ మొదటి ప్రాధాన్యతని, ప్రజలందరూ నిర్భయంగా తిరిగేలా పట్టణాన్ని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రఫీ , వార్డు సభ్యులు పాల్గొన్నారు . కుక్కల, కోతుల, బెడద నుండి కొంత ఉపశమనం కల్పిస్తున్నందుకు పట్టణ సినియర్ సిటీజన్ లు వర్షం వ్యక్తం చేశారు.

# గుంతలమాయమైన రోడ్డుకు మోక్షం..



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం,బచ్చన్నపేట మండలం,కేశిరెడ్డిపల్లి గ్రామం నుండి కన్నెబోయిన గూడెం వరకు గుంతలతో ప్రమాదకరంగా మారిన రహదారిని కేశిరెడ్డిపల్లి సర్పంచ్ రవి కుమార్ చొరవతో మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఉపశమనం కలిగించారు.గత కొంతకాలంగా రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో పాటు గుంపుగా రోడ్డు మీదకు వచ్చిన చెట్లతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ రోడ్డు గుండా జనగామకు వెళ్లాలంటే నరకమే నని వాహనదారులు వాపోయారు.సర్పంచ్ దృష్టికి ఈ సమస్య రావడంతో వెంటనే స్పందించి రహదారి మరమ్మతుల పనులు చేపట్టించారు.ప్రస్తుతం రోడ్డును సరిచేసి రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగిస్తూ ప్రయాణానికి అనుకూలంగా మార్చడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఇలాంటి అభివృద్ధి పనులు మరిన్ని చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతల రాజిరెడ్డి,వార్డు సభ్యులు ఇమ్మడి మహేష్ రెడ్డి,కంతి భాస్కర్,జక్కుల ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం చేయండి వైరా ఏసీపీ




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:వైరా ఏసిపి కార్యాలయం ఖమ్మంద్విచక్ర వాహనదారుల ప్రాణ రక్షణ కోసం ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని వైరా ఏసీపీ సారంగపాణి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సురక్షితమైన ప్రయాణాలను ప్రోత్సహించేందుకు వైరా డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో హెల్మెట్ అవగాహన ర్యాలీ వైరా పట్టణంలో నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశ్యంతో "హెల్మెట్ ఆన్.. లైఫ్ ఆన్" వంటి నినాదాలతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుతూ, ప్రమాదాల సమయంలో తల గాయాలు కాకుండా హెల్మెట్ ఎలా రక్షిస్తుందో ఈ ర్యాలీ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా వైరా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి సురక్షితమైన ప్రయాణం చేయాలన్నారు. మనకోసం, మన ఇంటి వాళ్లు ఎదురు చూస్తుంటారని, మన ప్రాణాలు మన కుటుంబానికి ఎంతో ముఖ్యమని గుర్తించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందికి ఏసిపి చేతుల మీదుగా హెల్మెట్ పంపిణి చేశారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ వెంకటప్రసాద్, ఎస్సై లు రామారావు, సూరాజ్, వెంకటకృష్ణ, వీరేందర్ పాల్గొన్నారు.

# రక్షణాత్మక డ్రైవింగ్ పై దృష్టి పెట్టాలి కారేపల్లి ఎస్సై గోపి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:కారేపల్లి పోలీస్ స్టేషన్ ఖమ్మంరక్షణాత్మక డ్రైవింగ్ పై దృష్టి పెట్టాలని కారేపల్లి ఎస్సై గోపి అన్నారు. అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా కారేపల్లి క్రాస్ రోడ్డులో ద్విచక్ర వాహన దారులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు పలు కీలక సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయడం ప్రమాదకరమని, అతివేగం ప్రాణాంతకమని హెచ్చరించారు. మైనర్ల డ్రైవింగ్ నిషేధమని, మద్యం సేవించి వాహనం నడపడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు.

# గ్రామ అభివృద్ధికి అండగా ఉంటా



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం,భువనగిరి ఎంపీ క్యాంప్ కార్యాలయం లో ఎంపీ.చామల కిరణ్ కుమార్ రెడ్డి ని,మర్యాదపూర్వకంగా కలిసిన మర్మాముల గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్,ఇప్ప నిషికాంత్ రెడ్డి,మరియు పాలకవర్గ సభ్యులు బంగ్లా సరిత సుధాకర్ రెడ్డి,ఇంధ్ల లావణ్య చంద్రమౌళి, పంగా స్వాతి మహిపాల్,మరియు కార్యకర్తలు.ఈ సందర్భంగా సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ మర్మాముల గ్రామ అభివృద్ధికి సంబంధించి పలు విషయాలు చర్చించామని వాటికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,గ్రామ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు మర్మాముల గ్రామం పై ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామలకు గ్రామ సర్పంచ్ మరియు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మత సామరస్యానికి ప్రతీకగా 'వీర హనుమాన్ విజయాత్ర' బైక్ ర్యాలీ గోడ పత్రిక ఆవిష్కరించిన మైనార్టీ నాయకులు రఫీ

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట మార్చ్ 29:చేగుంట: మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, భజరంగ్ దళ్, శ్రీ కార్తవీర్యాయోగాశ్రమం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన 'వీర హనుమాన్ విజయాత్ర' బైక్ ర్యాలీ గోడ పత్రికను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో జరిగిన సన్నాహక కార్యక్రమంలో చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ, భజరంగ్ దళ్ కండువా కప్పుకుని మత సామరస్యానికి సరికొత్త నిర్వచనం చెప్పారు. హిందూ ముస్లిం సోదరులందరూ మత విభేదాలకు అతీతంగా ఒక్కతాటిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ నెల 31వ తేదీ మంగళవారం నాడు హనుమాన్ దేవాలయం వద్ద శ్రీ కార్తవీర్య యోగాశ్రమం చేగుంట వారి సౌజన్యంతో మధ్యాహ్నం 1:00 గంట నుండి సుమారు వెయ్యి మంది భక్తులకు భారీ అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు కరణం గణేష్ రవి కుమార్ తెలిపారు. అనంతరం అదే రోజు సాయంత్రం 3:00 గంటల నుండి ఆధ్యాత్మిక చైతన్యం నింపే లక్ష్యంతో సాగే 'వీర హనుమాన్ విజయాత్ర' బైక్ ర్యాలీ అత్యంత వైభవంగా సాగనుందిఅని,చేగుంట గ్రామ క్షేమం కోసం, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని నిర్వహించ తలపెట్టిన ఈ



కార్యక్రమంలో చేగుంట మండలం తో పాటు పక్క మండలాల నుండి యువత, భక్తులు, ధర్మ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు నాగరాజు ప్రధాన కార్యదర్శి శ్యామ్ మండల అధ్యక్షులు సోమ సురేష్ భూపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంద్రుగు సతీష్, మండల బిజెపి పార్టీ మాజీ అధ్యక్షులు చింతల భూపాల్, చేగుంట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు సాయిబాబా, శ్రీరమణి శ్రీనివాస్, ఆరిఫ్,సుఖేందర్,శ్రీ కార్తవీర్యాయోగాశ్రమం సభ్యులు నాంపల్లి, భూపాల్ రెడ్డి,శంకర్,తదితరులు పాల్గొన్నారు

# మొక్కజొన్న పంటలో అధిక దిగుబడి కై అవగాహన కార్యక్రమం




మనప్రజాప్రతినిధి// దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామనియోజకవర్గం,తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రోజున చేర్యాలలో డివిజన్ వ్యవసాయ అధికారి రాధిక,ఆధ్వర్యంలో మొక్కజొన్న అధిక సాగులకై "ఎథనాల్ పరిశ్రమల క్యాచ్‌మెంట్ ప్రాంతాల్లో మక్కజొన్న ఉత్పత్తి వృద్ధి" ప్రాజెక్ట్ హెచ్.బి కింద ఫీల్డ్ డే టీజీ కార్యక్రమం నిర్వహించబడింది. జాతీయ బయోఫ్యూయల్ విధానం 2018 ప్రకారం, భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎథనాల్ బ్లెండెడ్ పెట్రోల్,కార్యక్రమాన్ని అమలు చేస్తోంది, ఇందులో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (OMCs) మిశ్రమ పెట్రోల్‌ను విక్రయిస్తున్నాయి.ఈ కార్యక్రమం కింద 2025 నాటికి పెట్రోల్‌లో ఇరవై శాతం ఎథనాల్ మిశ్రమం లక్ష్యంగా నిర్ణయించగా,2030 నాటికి ఙ30 మిశ్రమాన్ని అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ప్రాజెక్ట్ దేశంలోని పదిహేను రాష్ట్రాల్లో,డెబ్బై ఎనమిది జిల్లాల్లో అమలు చేయబడుతోంది.ఈ ఫీల్డ్ డే కార్యక్రమం పిళ్ళి నరేందర్ రైతు పొలంలో ఒక ఎకరాలో విత్తిన DMRH 1308 హైబ్రిడ్ మక్కజొన్న పంటలో నిర్వహించబడింది, మరియు ఎకరాకు సుమారు నలబై క్వింటాళ్ల దిగుబడి ఆశిస్తున్నారు.ఈ కార్యక్రమం డా.ఎన్. సునీల్, ప్రధాన శాస్త్రవేత్త (IIMR),డా.రాధిక,ఏ.డి. ఏ.సమక్షంలో నిర్వహించబడింది. వారు విత్తనం,ఎరువుల వినియోగం,కీటకాలు మరియు వ్యాధుల నియంత్రణ,పంట కోత తర్వాత నిర్వహణ (అఫ్లాటాక్సిన్ నియంత్రణ,నిల్వ మరియు మార్కెట్ లింకేజీలు) వంటి ఉత్తమ పంట నిర్వహణ పద్ధతులపై వివరించారు.అలాగే మక్కజొన్న నుండి ఎథనాల్ ఉత్పత్తి ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో ఎం.యాదగిరి,ఎం. కిషోర్ కుమార్,YP`1, IIMR కూడా పాల్గొన్నారు.అంతకుముందు 2025 నవంబర్ 14న, గ్రామంలోని యాబై ఎకరాల ప్రదర్శన కోసం యాబై మంది రైతులకు DMRH 1308 ఎనమిది కిలోలు, =3414 ఎనమిది కిలోలు మరియు P35719 ఎనమిది కిలోల హైబ్రిడ్ విత్తనాలు పంపిణీ చేయబడ్డాయి.ఈ కార్యక్రమం సందర్భంగా రైతులకు శాస్త్రీయ పద్ధతుల ద్వారా దిగుబడి మరియు ఉత్పాదకతను పెంచే విధానాలపై అవగాహన కల్పించబడింది. అలాగే ఎథనాల్ ఉత్పత్తి కోసం మక్కజొన్న ఒక ఆశాజనక పంటగా ఉన్నదని చర్చించారు. రైతులు "అన్నదాత" (ఆహార దాతలు) నుంచి "ఇంధనదాత" (ఇంధన దాతలు)గా మారుతున్నారని వివరించారు.ఈ కార్యక్రమంలో మొత్తం యాబై ఎనమిది మంది రైతులు,అందులో పదిహేడు మంది మహిళా రైతులు పాల్గొన్నారు.రైతులు కార్యక్రమంపై మంచి ఆసక్తి చూపించి, ఆధునిక పద్ధతులను అవలంబించి తమ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని సంకల్పం వ్యక్తం చేశారు.కార్యక్రమం సందర్భంగా రైతులు హైబ్రిడ్స్ మరియు ప్రాజెక్ట్ జోక్యం పట్ల తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.

# అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన సదస్సు: ఇన్స్పెక్టర్ కొండ్ర శ్రీనివాస్

హుస్నాబాద్ మార్చి //మన ప్రజా// ప్రతినిధి.29:నేరాల నియంత్రణకు పోలీసుల అరైవ్ అలైవ్ నిర్వహించినట్లు హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కొండ్ర శ్రీనివాస్ అన్నారు పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తాలో మున్సిపల్ కాంప్లెక్స్ లో ఆటో డ్రైవర్లు ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్సై లక్ష్మారెడ్డి తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు ఇందులో భాగంగా సిఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణాలు చేయొద్దని అలాగే వాహనానికి ఇన్సూరెన్స్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా ముఖ్యమేనని తెలిపారు కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకం ఇన్స్పెక్టర్ శ్రీహరి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:సత్తుపల్లి పోలీస్ స్టేషన్ ఖమ్మంప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని సత్తుపల్లి ఇన్స్పెక్టర్ శ్రీ హరి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణనష్టాన్ని నివారించేందుకు పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్" ప్రత్యేక కార్యక్రమం ద్వారా"సురక్షితంగా గమ్యం చేరడం" "ప్రాణాలతో ఉండటం" అనే లక్ష్యంతో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాముఖ్యతపై సత్తుపల్లి లోని జెవిర్ కాలేజ్ లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ... ప్రతిరోజూ జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకొని ప్రజల్లో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. అదేవిదంగా మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు.




## ఏప్రిల్ 5 నుంచి మీనావోలు లో... యువత గర్వంగా నిలిచే టోర్నమెంట్ ప్రారంభం





మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లాలోని మధిర నియోజకవర్గం పరిధిలో గల ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు గ్రామంలో ఏప్రిల్ 5 నుంచి స్థానిక పిల్లిబోస్ గ్రౌండ్ లో ముస్లి ఐక్య సంఘం ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్రీయ మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో ముస్లి ఐక్య సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా షేక్. ముజాహిద్ ఇషాతీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్. హుస్సేన్ సాహెబ్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్రికెట్ క్రీడాకారులకు, క్రీడా అభిమానులకు ఈ టోర్నమెంట్ లో హాజరు కావాలని కోరారు. ఈ టోర్నమెంట్ లో ప్రాతినిధ్యం వహించేందుకు గాను ఎంట్రీలు పంపవలసిన ఆఖరి తేదీ ఏప్రిల్ 3 కాగా అదే రోజు సాయంత్రం 6 గంటల లోపు ఎంట్రీ ఫీజు 1000 పది వేల రూపాయలు చెల్లించి నమోదు చేసుకోవాలని వారు సూచించారు. టోర్నమెంట్ లో విజేతలకు మొదటి బహుమానంగా .75000 డెబ్బెయి ఐదు వేల, రన్నరప్ కు .50000 యాబై వేల రూపాయలు ఇవ్వడంతో పాటు సెమీ ఫైనల్ కు చేరుకునే ప్రతీ జట్టుకు 10000 పది వేల రూపాయలు బహుమతిగా అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ (మీనవోలు) స్థల దాత పిల్లిబోస్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు ప్రకటిస్తూ.. రిజిస్ట్రేషన్ సమయంలో పూర్తి నిబంధనల గురించి వివరిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్: 991294641, 9063531748, 9010828776, 7995945346 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నేరేడుచర్ల( మన ప్రజాప్రతినిధి దినపత్రిక)నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దయాబెటిస్ క్యాంప నేరేడుచర్ల లయన్స్ క్లబ్ అధ్యక్షులు గుండ్రెడ్డి సైదిరెడ్డి ఆధ్వర్యంలో ఈరోజు పాత నేరేడుచర్ల రామాలయం వద్ద ఉచిత దయాబెటిస్ మరియు రక్త పోటుకు సంబంధించిన క్యాంపును డిస్టిక్ చైర్పర్సన్ బట్టు మధు క్లబ్బు పూర్వ కార్యదర్శి మున్సిపల్ కౌన్సిలర్ దొండపాటి అప్పిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గురించి బట్టు మధు దొండపాటి అప్పిరెడ్డి గార్లు మాట్లాడుతూ నేరేడుచర్ల లయన్స్ క్లబ్ నిరంతరము సమాజ సేవలో భాగంగా ఉచిత దయాబెటిక్ పరీక్షలను నిర్వహిస్తుందని ఇట్టి క్యాంపులను ఉపయోగించుకోవాలని తెలియజేశారు ఈరోజు ఆరోగ్యానికి సంబంధించిన సుమారు 75 మందికి ఉచిత దయాబెటిస్ మరియు రక్త పోటు పరీక్షలునిర్వహించడం జరిగింది. ఇట్టి ఉచిత పరీక్షలను క్లబ్ నిరంతరం హెల్త్ క్యాంపులను నిర్వహిస్తుందని ఇట్టి క్యాంపులను పేద ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్పర్సన్ చల్లా ప్రభాకర్ రెడ్డి క్లబ్ కార్యదర్శి ఎస్ కే యూసుఫ్ క్లబ్ కోశాధికారి సరికొప్పుల నాగేశ్వరరావు క్లబ్ సభ్యులు మూలగుండ్ల వెంకటరెడ్డి చిలక రాజు శ్రీను,బాలు,ఆర్.ఎం.పి మరియు మున్సిపల్ కౌన్సిలర్ ఇంజమూరి శ్రీకాంత్ పాత నేరేడుచర్ల గ్రామానికి చెందిన పోరెడ్డి బుచ్చిరెడ్డి ఎడవెల్లి నర్సిరెడ్డి పోరెడ్డి అమృతారెడ్డి పోరెడ్డి బాల్రెడ్డి నూకల సోమిరెడ్డి కోటయ్య కట్ట బాబు నవీన్ గ్రామానికి చెందిన అనేకమంది మహిళలు వృద్ధులు పాల్గొన్నారు

## నేరేడుచర్ల నియోజకవర్గ సాధనకై సకల జనులు కలిసి రావాలి



నేరేడుచర్ల( మన ప్రజా ప్రతినిధి దినపత్రిక)త్వరలో దేశవ్యాప్తంగా జరగనున్న నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నేరేడుచర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఏర్పాటు కొరకు సకల జనులు కలిసి రావాలని అందుకొరకు ఏప్రిల్ ఒకటవ తేదీ నేరేడుచర్ల లోని విశ్వబ్రాహ్మణ సంఘం బిల్డింగ్ నందు జరిగే సమావేశానికి హాజరు కావాలని సామాజిక కార్యకర్త ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు ఆదివారంనాడు ఆయన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల లో పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో నియోజకవర్గం అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడిందని అందువల్ల నేరేడుచర్లను అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు చేసుకునేందుకు ఈ ప్రాంత ప్రజలు ఐక్యంగా ఉండి నియోజకవర్గాన్ని సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఈ ప్రాంతంలోని నాయకులు కొంతమంది సూర్యాపేట జిల్లా రూరల్ కేంద్రం అసెంబ్లీ నియోజకవర్గం కావాలని లేదా మునగాల కేంద్రంగా నియోజకవర్గ ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయని ఇది ఎంత మాత్రం సమర్థ నియం కాదని ఇక్కడి ప్రజల ఓట్లతో గెలిచి ఇక్కడ ప్రజలకు ద్రోహం చేయాలని తలపెట్టడం క్షమించ రాని విషయం అని ఇప్పుడు నేరేడుచర్ల నియోజకవర్గం కాకపోతే మరొక 50 ఏళ్ల వరకు అయ్యే అవకాశం లేదని అందువల్ల సకల జనులు ఐక్యం కావాలని తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న విధంగానే జెండాలు పక్కకు పెట్టి అఖిలపక్షాలు నాయకులు నియోజకవర్గాన్ని సాధించుకునేందుకు ముందుకు రావాలని అందుకు కాంగ్రెస్ పార్టీ పెద్దన్న పాత్ర పోషించాలని ఆయన కోరారు. నేరేడుచర్ల నియోజకవర్గం అయితే ఇక్కడికి పోలీస్ సర్కిల్ కార్యాలయము శాసనసభ సభ్యుడి నివాసం తో పాటు అనేక ప్రభుత్వ కార్యాలయాలు సహజంగానే వస్తాయని తద్వారా ఈ ప్రాంతం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు

## బిల్ల సతీష్ కుమార్ కు ఉగాది మహా నంది పురస్కారం




మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 29 మార్చ్ :ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన బిల్ల సతీష్ కుమార్ కు ఉగాది మహానంది జాతీయ పురస్కారం లభించింది. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలిం భవన్ లో తెలుగు వెలుగు సాహిత్య వేదిక తరపున ఉగాది మహానంది జాతీయ పురస్కారాన్ని బ్రతుకమ్మ తల్లి గ్రంథకర్త డాక్టర్ వంగాల శాంతి కృష్ణ, ప్రముఖ సినీ హాస్యనటుడు ఆర్. ఎస్. నందా, సినీ నటి గుంటుక రాధిక ల చేతుల మీదుగా బిల్లా సతీష్ కుమార్ అందుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన బిల్ల సతీష్ కుమార్ సాయుధ పోరాట వనిత చాకలి ఐలమ్మ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ల మీద చైతన్య గీతాలు రాసినందుకు సాహిత్య సేవా రంగంలో ఈ ఉగాది మహా నంది పురస్కారాన్ని అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ యూత్ అధ్యక్షులు అద్దంకి నాగరాజు, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ చార్యులు పాల్గొన్నారు. ఈ పురస్కారాన్ని అందుకున్న బిర్లా సతీష్ కుమార్ ను గ్రామస్తులు, మిత్రులు, సాహితీవేత్తలు అభినందిస్తున్నారు.

## గ్రామ అభివృద్ధికి అండగా ఉంటా



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, చేర్యాల,జనగామ నియోజక వర్గం: జనగామ నియోజకవర్గం, భువనగిరి ఎంపీ క్యాంప్ కార్యాలయం లో ఎంపీ.చామల కిరణ్ కుమార్ రెడ్డి ని,మర్యాదపూర్వకంగా కలిసిన మర్మాముల గ్రామ సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్,ఇప్ప నిషికాంత్ రెడ్డి,మరియు పాలకవర్గ సభ్యులు బంగ్లా సరిత సుధాకర్ రెడ్డి,ఇండ్ల లావణ్య చంద్రమౌళి, పంగా స్వాతి మహిపాల్,మరియు కార్యకర్తలు.ఈ సందర్భంగా సర్పంచ్ సుందరగిరి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ మర్మాముల గ్రామ అభివృద్ధికి సంబంధించి పలు విషయాలు చర్చించామని వాటికి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,గ్రామ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు మర్మాముల గ్రామం పై ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ చామలకు గ్రామ సర్పంచ్ మరియు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.


